క్లుప్తంగా

దేశాభివృద్ధికి కృషి చేయాలి



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పార్లమెంట్ సభ్యులు దేశాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా యువజన అధికారి డి.కిషోర్ అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ విధి విధానాలపై అవగాహన కలిగించారు. పార్లమెంట్‌లో జరిగే ప్రశ్నోత్తరాల అంశాన్ని విద్యార్థినులతో చేయించారు. ఒక విద్యార్థిని స్పీకర్‌గాను, కొందరు విద్యార్థినులు పార్లమెంట్ సభ్యులుగా వ్యవహరించి ప్రశ్నోత్తరాల విధానాన్ని ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ పి.శైలజ, ఆంగ్ల శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీస్ శునకానికి శ్రద్ధాంజలి



డాన్ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎస్పీ మేరి ప్రశాంతి

ఏలూరు టౌన్: జిల్లా పోలీస్ శాఖలో విశేష సేవలందిస్తూ మృతి చెందిన పోలీస్ శునకం డాన్‌కు పోలీస్ లాంఛనాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్పీ డి.మేరి ప్రశాంతి డాన్ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. 2013 జూలై 1న జన్మించిన డాన్ ఏలూరు జిల్లాలో 2018 సంవత్సరంలో శిక్షణా సమయంలో గోల్డ్ మెడల్ సాధించింది. డాగ్ హ్యాండ్లర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షరీఫ్ పోలీస్ శునకం డాన్‌కు తర్ఫీదు ఇస్తూ అనేక కీలక కేసుల్లో నిందితులను గుర్తించేందుకు ఉపయోగించారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో డబుల్ మర్డర్ కేసులో, ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్ బాలిక హత్య కేసులో, కొయ్యలగూడెం హైవే పై జరిగిన నేర దర్యాప్తులో, భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రాబరీ దర్యాప్తులో డాన్ కీలకంగా తన సేవలు అందించినట్టు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపారాణి, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు.

వివాహిత మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు కొమడవోలు గ్రామానికి చెందిన ఒక వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. మంచినీళ్ల శివ దుర్గ (32)కు అధికంగా కడుపునొప్పి రావటంతో ఈనెల 3న ఎలుకల మందు తిని అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు శివదుర్గను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఏలూరు వార్షిక బడ్జెట్ ఆమోదం

- 20 అంశాల అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్
- కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో రగడ





మాట్లాడుతున్న నగర మేయర్ నూర్జహాన్, రెబల్స్‌కు కౌంటర్ ఇస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



టీడీపీ కార్పొరేటర్లకు సమాధానమిస్తున్న డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు జాన్

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన బుధవారం ఏలూరు వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. 20 అంశాలతో కూడిన అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పాలక పక్షం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారంతో నూతన బడ్జెట్‌కు అనుగుణంగా అభివృద్ధికి నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ఏలూరు వార్షిక బడ్జెట్ రూ.243.84 కోట్ల అంచనాలతో రూపొందించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జమా ఖర్చులు రూ.233.52 కోట్లుగా అంచనా వేశామని ముగింపు నిల్వ రూ.10.31 కోట్లుగా ఉంటుందని వివరించారు. నగరాభివృద్ధికి రాష్ట్ర, కేంద్రానికి సంబంధించి ఆయా గ్రాంట్లను తీసుకొచ్చేందుకు కౌన్సిల్ సభ్యుల సమష్టి కృషితో ముందుకెళ్తామని మేయర్ చెప్పారు.

వాడీవేడిగా చర్చ

ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ ప్రత్యేక సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, టీడీపీ, వైఎస్సార్ సీపీ రెబల్ కార్పొరేటర్ల మధ్య వాడివేడిగా చర్చ సాగింది. టీడీపీ, వైఎస్సార్ సీపీ రెబల్ కార్పొరేటర్లు అసంబద్ధ ఆరోపణలు చేస్తూ రగడ చేసేందుకు ప్రయత్నించగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ధీటుగా సమాధానమిచ్చారు. ప్రతి అంశాన్నీ రాద్ధాంతం చేయాలనే లక్ష్యంతో టీడీపీ కార్పొరేటర్లు వ్యవహరించగా వారి ఆరోపణలను తిప్పికొడుతూ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ ధీటైన కౌంటర్లు ఇచ్చారు. కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు సభ్యుల ప్రశ్నలకు సావదానంగా సమాధానమిస్తూ టీడీపీ సభ్యులకు అవగాహన కల్పించారు. సభలో గందరగోళం సృష్టించేందుకు టీడీపీ సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

దమ్ముంటే రాజీనామా చేయాలి

కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కార్పొరేటర్లు పప్పు ఉమామహేశ్వరరావు, కర్రి శ్రీనివాస్ ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకోవడం అనంతరం కౌన్సిల్ సమావేశంలో టీడీపీకి అనుకూలంగా పాలకపక్షంపై అసత్య ఆరోపణలకు దిగడంతో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ప్రతి అంశానికీ అడ్డుపడుతూ విమర్శలు చేయడంతో దమ్ముంటే ఫ్యాన్ గుర్తుపై పోటీ చేసిన మీరు రాజీనామా చేసి సొంతంగా గెలిచి చూపించాలని కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ వారికి సవాల్ విసిరారు. ఫ్యాన్ గుర్తు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, సీఎం జగన్ బొమ్మలు పెట్టుకుని గెలిచిన మీరు టీడీపీ విసిరిన బిస్కెట్లకు కక్కుర్తిపడి ఆరోపణలు చేస్తున్నారని, రాజీనామా చేసి మాట్లాడాలని డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

ఏప్రిల్ 1 నుంచి జీఓ ప్రకారం జీతాల చెల్లింపులు

నగరపాలక సంస్థ యాజమాన్యంలోని 49 స్కూల్లో పనిచేస్తోన్న స్వీపర్లు, నైట్ వాచ్‌మెన్లకు జీతాలు చెల్లించే అంశంపై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయగా కోఆప్షన్ సభ్యుడు పెదబాబు సమాధానమిస్తూ... విద్యాశాఖ అధీనంలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్వీపర్‌కు నెలకు రూ.8 వేలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసిందని, గతంలో రూ.4 వేలు ఇస్తుండగా మరో రూ. 4 వేలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఈ జీఓ అనుసరించి జీతాలు చెల్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

కోర్టు ఉత్తర్వులు అనుసరించి నడుచుకోవాలి

ఏలూరు నియోజకవర్గంలో పలు సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ఆయా సంఘాల అభ్యర్ధనల మేరకు ఎమ్మెల్యే ఆళ్ల నాని స్థలాలు కేటాయించగా.. దానికి సంబంధించి కౌన్సిల్‌లో ఉంచిన అజెండాపై విపక్షాలు తీవ్రస్థాయిలో గలాట సృష్టించాయి. దీనిపై కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, పాలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్ స్పందిస్తూ టీడీపీ సభ్యులు ఆయా కులాలకు స్థలాలు ఇవ్వవద్దని చెప్పే దమ్ముందా అని నిలదీశారు. మీరు కులాలకు వ్యతిరేకమా అంటూ ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వులు అనుసరించి నడుచుకోవాల్సిన బాధ్యత కౌన్సిల్‌పై ఉందని కోఆప్షన్ సభ్యుడు పెదబాబు అన్నారు. కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు కోర్టుకు వెళ్తామని చెబుతున్నారని, కోర్టుకు వెళ్లినా ఆయా సామాజికవర్గాలకు న్యాయం ఎలా చేయాలో కౌన్సిల్‌కు తెలుసని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే నాని అన్ని వర్గాలకు స్థలాలు కేటాయించడం అభినందనీయమని కోఆప్షన్ సభ్యులు కొంపెల్ల తాయారు తెలిపారు.

'పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం'



సత్యవతికి చెక్కు అందిస్తున్న ఎస్పీ

ఏలూరు టౌన్: పోలీస్ శాఖలో పనిచేస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు తామంతా ఎప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ డి.మేరి ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా హోంగార్డ్ యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డ్ ఐ.మధుసూదనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భార్య సత్యవతికి ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో రూ.5,47,410 చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ మొత్తాన్ని హోంగార్డు సంక్షేమ నిధుల నుంచి సేకరించారు. ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

ఆధ్యాత్మిక సేవతో సంతృప్తి



కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజల్లో ఇటీవల ఆధ్యాత్మిక చింతన పెరిగిందని, ప్రతి ఒక్కరూ భక్తి భావంతో దైవ సేవ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరు, పైభాగాన నిర్మించిన కల్యాణ మండపాలను నాని బుధవారం ప్రారంభించారు. ఎంతో భక్తిభావంతో దైవ సేవలు చేసే వారిని గుర్తించి నగరంలోని పలు ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో అవకాశం కల్పించామని, అటు భగవంతుని సేవతో పాటు ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ట్రస్ట్‌బోర్డు ప్రతినిధులు విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ భాస్కర్ల రమా నాగశంకర్, ధర్మకర్త ఏవీ సోమేశ్వర రావు, కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ రావు, ఆలయ ఈఓ డి.శంకరరావు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ఫంక్షనల్ కమిటీలు

- రైతులకు రూ 1.90 కోట్ల పరిహారం
- రూ.75 లక్షలతో రోడ్లు
- రూ.36 కోట్లతో ఉపాధి పనుల ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రణవి



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

ఏలూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ మండల గ్రామాల అభివృద్ధికి మూడు రకాల ఫంక్షనల్ కమిటీలు ఏర్పాటు చేశామని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం ఏలూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, భవనాలు, కల్వర్టులు, డ్రెయిన్ల అభివృద్ధిని పరివేక్షించే వర్క్స్ కమిటీ వేశామని, చైర్‌పర్సన్‌గా బలే సత్యప్రసాద్, సభ్యులుగా కాకర్ల తంబి, మోరు రజని, బొమ్మవరపు మణెమ్మ సభ్యులుగా ఉంటారని తెలిపారు. వ్యవసాయం, పశుసంవర్ధక, ఫిషరీస్, వాటర్‌హెడ్స్, తాగునీరు అభివృద్ధి పనుల పర్యవేక్షించే సహజ వనరులు కమిటీకి చైర్మన్‌గా పెన్మెత్స శ్రీనివాసరాజు, మండల శైలజ, గుత్తా గంగాభవాని, మూరుమూడి జ్యోతిజ రీనా, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్త్రీశిశు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమం పరివేక్షించే మానవ వనరుల కమిటీలో చైర్ పర్సన్‌గా బోడిగడ్డ కుమారి, నరహరశెట్టి నాగమణి, గండికోట నాగరాజు, బలే స్వాతిని నియమించామని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఏలూరు రూరల్ గ్రామాల్లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశారని కొనియాడారు. ఎంపీడీఓ బి.ప్రణవి మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులు గ్రామ కమిటీ సభ్యులతో కలిసి విధులు నిర్వహిస్తారని చెప్పారు. తొలుత సమావేశంలో సభ్యులు, అధికారులు పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. సర్పంచ్‌లు తెనాలి యోహాన్, బలే నాగప్రసాద్, గుడిపూడి రఘు, వర్రీ లక్ష్మీదుర్గ, వేజెళ్ల గోపాల కృష్ణంరాజు, పత్యాల సునీత తదితరులు హాజరయ్యారు.

రూ.36 కోట్లతో ఉపాధి పనులు

2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.36 కోట్లతో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామని ఏపీఓ కిషోర్ చెప్పారు. ఇందులో రూ.22 కోట్ల వేతనాలు మరో రూ.14 కోట్లు మెటీరియల్ కాంపొనెంట్ నిధులు ఉన్నాయని తెలిపారు.

రూ.75 లక్షలతో రోడ్లు

పీఆర్ ఏఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ 2024–25 సంవత్సర కాలంలో రూ.75 లక్షల జెడ్పీ నిధులతో గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, చాటపర్రు, పెదయాగనమిల్లిలో గ్రావెల్ రోడ్లు, సీసీరోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం అనుమతి లభించిందన్నారు. ఇందులో మూడు పనులకు టెండర్లు పక్రియ పూర్తయిందని చెప్పారు.

రైతులకు నష్టపరిహారం

గతంలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన 1,429 మంది రైతులకు రెండు రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.90 కోట్ల నష్టపరిహారం అందించనున్నారని అధికారులు తెలిపారు. ఈ మొత్తం బాధిత రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతాయన్నారు.

తపాలా సేవలను ప్రజలకు చేరువ చేయాలి

ఏలూరు (టూటౌన్): తపాలా శాఖ పథకాలు, సేవలను ప్రజలకు చేరువ చేయాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్స్ యు.ఎలమందయ్య అన్నారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు నోడల్ డెలివరీ సెంటర్‌లో తపాలా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన స్కీంను ప్రతి ఇంటికి తెలియజేయాలన్నారు. ఈ పథకానికి సంబంధించి ఈ నెలలో కనీసం 24 వేలు రిజిస్ట్రేషన్లు పూర్తిచేసే లక్ష్యంతో ఏలూరు డివిజన్ డెలివరీ స్టాఫ్ పనిచేస్తారని వివరించారు. ఈ డివిజన్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం 2023-24కు 44 వేలు నికర ఖాతాలు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 24 వేలు నికర ఖాతాల లక్ష్యాన్ని ఏలూరు డివిజన్ సిబ్బంది పూర్తి చేశారని తెలిపారు. సమావేశంలో ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.అంబేడ్కర్ రాజు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు జి.దుర్గారావు,డి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	30	కంద	64
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	38
కాకర కాయలు	30-40	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	90
కాలీఫ్లవర్	30	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	30-40	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-20	గోంగూర	08
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు



2వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, ఇడా చైర్మన్ బొద్దాని



1వ డివిజన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే నాని, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. 1వ డివిజన్ కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక, పార్టీ నాయకులు ఆరేపల్లి సత్తిబాబు, 2వ డివిజన్ కార్పొరేటర్ జున్నూరు కనక నర్సింహారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాని నాయకులు, ముఖ్య కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సమాజంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని, భవిష్యత్ తరాలకు ఉన్నత బాటలు వేస్తూ విద్యారంగాన్ని సమూలంగా మార్చివేశారని తెలిపారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నేడు ప్రభుత్వ బడులు నూతన శోభను సంతరించుకుంటున్నాయని వివరించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు వైద్యరంగంలో నూతన శకాన్ని ప్రారంభించారని చెప్పారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల, బోధనాసుపత్రి తీసుకురావడం ద్వారా ఆధునిక వైద్య చికిత్స, సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకురావడం ద్వారా అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని వివరించారు. సమావేశాల్లో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, స్థానిక నాయకులున్నారు.

రెవెన్యూ భవనంలో మహిళా దినోత్సవం

ఏలూరు (మెట్రో): ఏపీ జేఏసీ అమరావతి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవెన్యూ భవనంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో నిర్మల జ్యోతి, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మంజు భార్గవి, ఏపీఎస్ ఆర్టీసీ మెడికల్ అధికారి ఉదయభాను ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించే క్రమంలో మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో విజయవంతంగా రాణించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. జేఏసీ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని కొనియాడారు. మహిళా ఉద్యోగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా విభాగం చైర్‌పర్సన్ సుందరి, కో-చైర్‌పర్సన్ యు.యామిని, జనరల్ సెక్రటరీ బి.గీతిక, అసోసియేట్ చైర్‌పర్సన్ శాంతకుమారి, స్టేట్ సెక్రటరీ జి.జ్యోతి, ట్రెజరర్ భవ్రి పాల్గొనారు.

నేడు మహిళా సాధికారతపై అవగాహన

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత అంశంపై గురువారం ఉదయం 9.30 గంటలకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవా సదన్ భవనంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జ్యుడిషియల్ అధికారులు, అడ్వకేట్స్, ప్యానల్ లాయర్స్, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

బీసీల ద్రోహి చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నేత చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్ పేరుతో కపట ప్రేమ ఒలకబోస్తున్నారని, నిజమైన బీసీల ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు నగర కమిటీ దుయ్యబట్టింది. స్థానిక వన్‌టౌన్‌లోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన దాదాపు 10 శాతం రిజర్వేషన్లను టీడీపీ గండి కొట్టిందన్నారు. చంద్రబాబు హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించ లేదని అన్నారు. సీఎం జగన్ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు మొత్తం 58.5 శాతం రిజర్వేషన్లు కల్పించి, అన్ని రకాల స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారని వివరించారని, జీఓ విడుదల చేశారని వివరించారు. జగన్ సర్కారు నిర్ణయంపై కర్నూలు జిల్లాకు చెందిన బిర్రా ప్రతాప్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటడంపై సుప్రీంకోర్టుకు వెళ్లారని చెప్పారు. ప్రతాప్‌రెడ్డి పిటీషన్‌తో సుప్రీం కోర్టు జీఓ 176ను కొట్టి వేసిందన్నారు. ఈ తీర్పుతో కొత్త నాటకానికి తెరతీసిన చంద్రబాబు రిజర్వేషన్లు తగ్గించడానికి వీల్లేదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ తన ద్వంద్వ వైఖరిని చాటుకున్నారని విమర్శించారు. ఈ నెల 5న మంగళగిరిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో బీసీలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు 10 రకాల హామీలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. బీసీలకు మేలు చేసిన నిజమైన పార్టీ వైఎస్సార్‌సీపీకే వచ్చే ఎన్నికల్లో బీసీలంతా అండదండలు ఇవ్వాలని రాజగోపాలాచారి కోరారు. సమావేశంలో పార్టీ బీసీ సెల్ ఏలూరు నగర ఉపాధ్యక్షుడు కింజంగి రాజు, కార్యదర్శి గంట సాల వెంకటరమణ, యువజన సంఘం కార్యదర్శి ఈదలాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.